సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం ꠰ 20 ꠰ మే ꠰ 2025



పారిజాతగిరిలో బ్రహ్మోత్సవాలు
జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.
8లో ▸



మట్టి తరలింపుతో ఉక్కిరిబిక్కిరి
చెరుకువాడ గ్రామంలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుండటంతో గ్రామస్తులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
8లో ▸



యువకుడి మృతి
రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొట్టగా యువకుడు మృతి చెందిన ఘటన కోడేరులో చోటుచేసుకుంది.
8లో ▸

న్యూస్‌రీల్

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యతతో పాటు అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో భాగంగా జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావుతో కలిసి అర్జీలు స్వీకరించారు. అర్జీల్లో కొన్ని..

డబ్బు కట్టి మోసపోయాం
విస్సాకోడేరు పంచాయతీ పరిధిలో శ్రీహరిపురం పేరిట వేసిన లేవుట్‌లో స్థలాలకు డబ్బు కట్టి మోసపోయామని విశ్రాంతి ఉద్యోగులు ఉద్యోగులు పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్ చేయకుండా, ప్లాట్లు అప్పగించకుండా ఏపీ స్టేట్ గర్నమెంట్ ఎంప్లాయిస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ తమను మోసం చేసిందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

అంబేడ్కర్ భవన సమస్య పరిష్కరించాలి
భీమవరం అంబేడ్కర్ భవన్ సమస్య పరిష్కరించాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భవనం గురించి మాట్లాడుతున్న దళిత ఉద్యోగులు, దళితులపై సంబంధం లేని వ్యక్తులు దాడులకు దిగుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీల్లో నియామకాలు

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీగా ఒరిగేటి మనోజ్ (తణుకు), రాష్ట్ర దివ్యాంగుల విభాగం ఉపాధ్యక్షుడిగా కొల్లాటి నాగరాజు (నరసాపురం), రాష్ట్ర దివ్యాంగుల విభాగం జనరల్ సెక్రటరీగా బుంగా జయరాజు (పాలకొల్లు), రాష్ట్ర దివ్యాంగుల విభాగం సెక్రటరీగా కేసిరెడ్డి దిలీప్ (ఉండి) నియమితులయ్యారు.

చట్టపరిధిలో ఫిర్యాదులపై చర్యలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భీమవరం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పూర్తిస్థాయి విచారణ జరిపి చట్టపరిధిలో పరిష్కరిస్తామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. భీమవరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా 8 ఫిర్యాదులు స్వీకరించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీషా పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్ పరీక్షలు



భీమవరంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలో ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 100 మందికి 87 మంది, మధ్యాహ్నం 100 మందికి 97 మంది, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 90 మందికి 81 మంది, మధ్యాహ్నం 90 మందికి 85 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీఎన్నార్ అటానమస్ కళాశాలలో ఉదయం 91 మందికి 78 మంది, మధ్యాహ్నం 90 మందికి 79 మంది, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 91 మందికి 81 మంది, మధ్యాహ్నం 90 మందికి 81 మంది హాజరయ్యారు.

తాడేపల్లిగూడెంలో..
తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఈఏపీసెట్ పరీక్షలకు ఉదయం 241 మందికి 219 మంది, మధ్యాహ్నం 239 మందికి 224 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ పర్యవేక్షించారు.

కూటమి నిస్సిగ్గు రాజకీయం

ప్రజాస్వామ్యం అపహాస్యం
- ఎంపీపీ ఎన్నికల్లో అక్రమ కేసులు, తీవ్రస్థాయిలో బెదిరింపులు
- ఒత్తిళ్లను తట్టుకుని యలమంచిలి ఎంపీపీ వైఎస్సార్‌సీపీ కైవసం
- అత్తిలిలో ఓటింగ్‌కు అంబులెన్స్‌లో ఫిరాయింపు ఎంపీటీసీలు
- ఎమ్మెల్యే ఆరిమిల్లి చిల్లర వ్యవహారాలపై సర్వత్రా చర్చ
- యలమంచిలిలో చేతులెత్తేసిన మంత్రి నిమ్మల
- కైకలూరులో బీజేపీ కాకుండా టీడీపీకి కామినేని పట్టం
- ఉమ్మడి జిల్లాలో ముగిసిన ఉప పోరు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: భారీ ప్రలోభాలకు అధికార పార్టీ తెరలేపింది. ప్రలోభాలకు లొంగకపోవడంతో వ్యక్తిగత ఆస్తులు, వ్యాపారాలపై దాడులు చేయిస్తామని బెదిరించింది. దానికి భయపడకపోవడంతో అక్రమ కేసులు బనాయించింది. అయినా యలమంచిలి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలంతా మంత్రి నిమ్మల రామానాయుడు చర్యలను సమర్థంగా తట్టుకుని నిలబడటంతో సోమవారం మంత్రి నిమ్మల చేతులెత్తేశారు. పర్యవసానంగా యలమంచిలి ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ దక్కించింది. జిల్లాలో ఉప ఎన్నికలు జరిగిన మూడు స్థానాల్లో టీడీపీకి సింగిల్ డిజిట్ బలం లేకపోయినా అడ్డగోలుగా ఎన్నికల్లో పోటీ చేసి బెదిరింపు, దౌర్జన్యాలతో అత్తిలి ఎంపీపీ, కైకలూరు వైస్ ఎంపీపీ స్థానాలను దక్కించుకుంది. తద్వారా జిల్లాలో నిస్సిగ్గు రాజకీయాలకు టీడీపీ యథేచ్ఛగా కొనసాగించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

యలమంచిలిలో నిబద్ధతకు పట్టం కట్టి..
యలమంచిలి, అత్తిలి ఎంపీపీ స్థానాలకు, కైకలూరు వైస్ ఎంపీపీ స్థానాలకు ప్రత్యేకాధికారులు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. యలమంచిలిలో 18 మంది ఎంపీటీసీలకుగాను ఒక స్థానం ఖాళీ కావడంతో 17 మంది సభ్యులుండగా దానిలో 13 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు కాగా మిగిలిన ముగ్గురు టీడీపీ, ఒకరు జనసేన. 13 మంది సభ్యుల్లో ఒకరు జనసేనలో చేరడంతో 12 మంది సభ్యులు వైఎస్సార్‌సీపీలో ఉన్నారు. ఈ క్రమంలో గత మార్చి 27న ఎన్నిక జరగాల్సి ఉండగా టీడీపీ మంత్రి నిమ్మల డైరెక్షన్‌లో చిల్లర రాజకీయాలు చేసి 28కి వాయిదా పడేలా చేసింది. 28న కూడా హైడ్రామా నడిపి ఎన్నిక వాయిదా వేయించారు. ఈ క్రమంలో ఎన్నిక నిరవధికంగా వాయిదా ప్రకటించిన క్రమంలో వైఎస్సార్‌సీపీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఎన్నికల అధికారులకు మొట్టికాయలు వేసింది. దీంతో అధికారులు మరలా ఎన్నిక నిర్వహించారు. మంత్రి రామానాయుడు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురకూడదనే కక్షతో సభ్యులను రకరకాలుగా భయభ్రాంతులకు గురిచేయడం, పార్టీ నేతలపై కక్షపూరితంగా కేసులు బనాయించి నానాయాగీ చేసినా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధైర్యంగా ముందడుగు వేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు ఎన్నికకు హాజరుకావడంతో కూటమి ముఖం చాటేసింది. ఎంపీపీగా ఇనుకొండ ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించి డిక్లరేషన్ అందజేశారు.

కైకలూరులో టీడీపీకే కామినేని మద్దతు
కైకలూరులో భారతీయ జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కామినేని శ్రీనివాస్ స్థానికంగా ఆ పార్టీ నేతలకు పదవులు దక్కకుండా బలంగా చక్రం తిప్పుతున్నారు. సాధారణ నామినేట్ పదవులు మొదలు అన్నింటిలోనూ టీడీపీ సభ్యులు మినహా సొంత పార్టీకి ప్రాధాన్యం లేదు. ఇదే క్రమంలో కైకలూరు వైస్ ఎంపీపీ-1 స్థానాన్ని టీడీపీకి కట్టబెట్టారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు పార్టీ విప్ జారీ చేసింది. అయినా ఎమ్మెల్యే ఒత్తిళ్లతో పార్టీ మారిన సభ్యులు విప్ ధిక్కరించి టీడీపీకి ఓటు వేశారు. కైకలూరులో మొత్తం 22 స్థానాలకు 21 స్థానాలు వైఎస్సార్‌సీపీ, ఒకటి టీడీపీ గతంలో గెలుచుకుంది.

ఆరిమిల్లి అంబులెన్స్ రాజకీయం
తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మరోసారి తనదైన శైలిలో చిల్లర రాజకీయాలకు తెరతీశారు. అత్తిలి మండలంలో 20 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను 16 మంది వైఎస్సార్‌సీపీ, రెండు టీడీపీ, రెండు జనసేన గెలుపొందారు. ఒక వైఎస్సార్‌సీపీ సభ్యుడు గల్ఫ్‌లో ఉండటంతో మొత్తం 19 మంది ప్రస్తుతం ఎంపీటీసీలుగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో గత మార్చిలో అత్తిలి ఎంపీటీసీలతో మాజీ మంత్రి కారుమూరి తన నివాసం నుంచి ఓటింగ్‌కు వెళ్తున్న క్రమంలో దాదాపు వెయ్యి మందికిపైగా టీడీపీ కార్యకర్తలు కారుమూరి ఇంటిని చుట్టుముట్టి దౌర్జన్యం చేసి దాడికి యత్నించి ఎంపీటీసీలు ఓటింగ్‌కు వెళ్లనీయకుండా నిలువరించారు. ఇదంతా పోలీసుల కళ్లెదుట జరిగినా స్పందించని పరిస్థితి. ఆ మరుసటి రోజు కూడా ఓటింగ్‌కు వెళ్లనీయకుండా ఎంపీటీసీలను ఒక రకంగా ఇంట్లోంచి బయటకు రాకుండా ఆందోళనకర వాతావరణం సృష్టించారు. నిరవధిక వాయిదా పడి సోమవారం ఎన్నిక జరుగుతుందని అధికారులు ప్రకటించిన క్రమంలో మూడు రోజుల ముందే వైఎస్సార్‌సీపీ సభ్యులు కొందరిపై తీవ్రస్థాయిలో బెదిరింపులకు దిగారు. ఒక ఎంపీటీసీ దుబాయిలో పనిచేస్తున్న క్రమంలో ఆయన ఇంటికి పోలీసులను పంపి బెదిరించి తీవ్రస్థాయిలో ఒత్తిడి తేవడం, మరో ఎంపీటీసీ ఇల్లు రోడ్డుపై ఉందని ఆక్రమణ కింద ఇంటిని కూల్చేస్తామని బెదిరించడం, మరికొందరు ఎంపీటీసీల వ్యాపారాలపై దాడులు చేయిస్తామని బెదిరించడం ఇలా తీవ్రస్థాయిలో భయపెట్టి అత్తిలి ఎంపీపీ స్థానాన్ని టీడీపీ దక్కించుకునేలా వ్యవహరించారు. కట్ చేస్తే.. టీడీపీ నుంచి ఎంపీపీగా గెలుపొందిన మక్కా సూర్యనారాయణ మూడేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీపీగా గెలుపొందిన వ్యక్తే కావడం గమనార్హం. పర్యవసానంగా టీడీపీలో మొదటి నుంచి ఉన్న ఎంపీటీసీలకు ఆరిమిల్లి హ్యాండ్ ఇచ్చారనే చర్చ నియోజకవర్గంలో సాగుతోంది. మరోవైపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఓటింగ్ వద్ద అడ్డుకుని ఆందోళన నిర్వహిస్తారనే భయంతో ఆరిమిల్లి ఎంపీటీసీలందరినీ అంబులెన్స్‌లో ఎన్నికకు తీసుకురావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

సంతలో పశువుల్లా కొన్నారు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



అత్తిలిలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, సంతలో పశువుల మాదిరిగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను కొనుగోలు చేసి, ఎంపీపీ స్థానాన్ని గెలిపించుకున్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దుయ్యబట్టారు. సోమవారం అత్తిలిలోని తన నివాసంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అత్తిలి మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఉప ఎన్నికలు మార్చి 27న జరగాల్సి ఉండగా కూటమి శ్రేణులు అడ్డుకున్నారని విమర్శించారు. తిరిగి మరలా సోమవారం ఎన్నికలు జరగ్గా వైఎస్సార్‌సీపీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీ సభ్యులను ఎమ్మెల్యే రాధాకృష్ణ కొనుగోలు చేసి ఎంపీపీ స్థానాన్ని గెలవడం సిగ్గుచేటన్నారు. ఇది సిగ్గుగా అనిపించడం లేదా అని ప్రశ్నించారు.

దమ్ముంటే రాజీనామా చేయించండి
ఎమ్మెల్యేకు దమ్ము, ధైర్యం ఉంటే వెంటనే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లినవారితో రాజీనామా చేయించి, తిరిగి ఎన్నికలకు సిద్ధం కావాలని, అప్పుడు తెలుస్తుంది ఎవరి సత్తా ఏమిటో అని మాజీ మంత్రి కారుమూరి సవాల్ చేశారు. ఎంపీపీగా గెలిచామని చెప్పుకొంటున్న మక్కా సూర్యనారాయణ ఫ్యాన్ గుర్తుపై గెలిచిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడేనని గుర్తుచేశారు.

అంబులెన్సులో తరలించడం పిరికిపంద చర్య
ఎంపీపీ ఎన్నికకు ఎంపీటీసీ సభ్యులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ.. అంబులెన్స్ వాహనంలో మండల పరిషత్ కార్యాలయానికి తీసుకురావడం పిరికిపంద చర్యగా కారుమూరి అభివర్ణించారు. ఎంపీపీ ఎన్నికల్లో విష సంస్కృతికి కూటమి నాయకులు తెరతీశారన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న ఎంపీటీసీ సభ్యులు నిజాయతీపరులు, ఆణిముత్యాలు అని, మాజీ సీఎం జగన్ గుండెల్లో వారికి ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. తణుకు నియోజకవర్గాన్ని జూద క్రీడలకు నిలయంగా ఎమ్మెల్యే మార్చివేశారన్నారు. ప్రతి పనికీ ఆర్‌కే ట్యాక్స్ పేరుతో అక్రమ వసూళ్లు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు రంభ సుజాత, దారం శిరీష, అనిశెట్టి త్రిమూర్తులు, అద్దంకి శ్రీను, నల్లమిల్లి నాగమణి, గుడిమెట్ల ధనలక్ష్మి, ఆడారి శ్రీనివాసరావు, దొమ్మేటి రమ్య, నాయకులు రంభ సూరిబాబు, పెన్మెత్స రామరాజు, పోలినాటి చంద్రరావు, మద్దాల శ్రీనివాస్, కంకటాల సతీష్, సబ్బితి రాజేష్, కోరుకొల్లు వెంకట్రావు, రామిశెట్టి రాము పాల్గొన్నారు.

యలమంచిలిలో న్యాయం గెలిచింది

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



యలమంచిలి ఎంపీపీగా ఎన్నికైన ఇనుకొండ ధనలక్ష్మిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: యలమంచిలి ఎంపీపీ ఎన్నికల్లో తెలుగుదేశం నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చివరకు న్యాయమే గెలిచి ఇనుకొండ ధనలక్ష్మి ఎంపీపీ అయ్యారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఎంపీపీ ఎన్నిక అనంతరం చించినాడలోని మునసబు బంగ్లాలో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు అభినందన సభ నిర్వహించారు. ఎంపీపీ ధనలక్ష్మితోపాటు ఆమెకు అండగా నిలిచిన ఎంపీటీసీ సభ్యులందరినీ పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అంటే మూడు రంగుల జెండా, ఒకటే అజెండా ఉంటుందన్నారు. మూడు పార్టీలు కూటమిలా అధికారం కోసం అడ్డదారులు తొక్కడం తమ నాయకుడు జగన్‌కు చేతకాదన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని తెలుగుదేశం నాయకులు చేసిన కుట్రలు భగ్నమయ్యాయంటే అది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుల నిజాయతీకి తార్కాణమన్నారు. కూటమి నాయకుల ప్రలోభాలకు గురికాకుండా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచిన ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు.

కూటమికి చెంపపెట్టు : పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలని చూసిన తెలుగుదేశం నాయకులకు ఈ ఎన్నికలు చెంపపెట్టు అన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారం కోసం తెలుగుదేశం నాయకులు ఎన్ని అడ్డదారులు తొక్కినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్, మాజీ కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు, నాయకులు నిమ్మకాయల రామకృష్ణ, బోనం బులివెంకన్న, నడపన గోవిందరాజులు నాయుడు, చివటపు నాగేశ్వరరావు, రావూరి బుజ్జి, వీరా ఉమాశంకర్, మేళం రామాంజనేయులు, మంద హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం
యలమంచిలి: యలమంచిలి ఎంపీపీగా ఇనుకొండ ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఎంపీపీ ఎన్నికలో ఆమె ఒక్కరే ఎంపీపీ స్థానానికి నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎంపికైనట్లు డ్వామా పీడీ, ప్రిసైడింగ్ అధికారి కేసీహెచ్ అప్పారావు ప్రకటించారు. ఎన్నిక పూర్తయిన తరువాత ఆయన ధనలక్ష్మికి ఎన్నిక పత్రం అందజేశారు. అనంతరం ఆమెతో ప్రమాణస్వీకారం చేయించారు.

కోర్టు మొట్టికాయలతో ఎన్నిక నిర్వహణ..
మార్చి నెలలో కూటమి సభ్యులు, నాయకుల హైడ్రామాకు అధికారులు వత్తాసు పలకడంతో అప్పుడు ఎంపీపీ ఎన్నిక జరగకుండానే వాయిదా పడటంతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు 12 మంది హైకోర్టును ఆశ్రయించారు. కోరం సభ్యులు వచ్చినా ఎంపీపీ ఎన్నిక నిర్వహించకపోవడంపై జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఆశ్చర్యంతోపాటు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలతో మరలా ఇప్పుడు ఎన్నిక నిర్వహించారు.

ఇరగవరం ఉప సర్పంచ్ ఏకగ్రీవం



ఉప సర్పంచ్‌తో వార్డు సభ్యులు

ఇరగవరం: ఇరగవరంలో సోమవారం జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి పట్టు నిలుపుకుంది. అధికార కూటమి నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కోటిపల్లి వీర వెంకట సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు డిప్యూటీ ఎంపీడీఓ, ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎన్నిక అనంతరం ఉప సర్పంచ్ కోటిపల్లికి సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, వార్డు సభ్యులు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. తనకిచ్చిన అవకాశం బాధ్యతను పెంచిందని, గ్రామాభివృద్ధి కోసం కృషిచేస్తానని ఉప సర్పంచ్ కోటిపల్లి అన్నారు. గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం మూడేళ్లు ఒకరు, రెండేళ్లు మరొకరు ఉప సర్పంచ్ పదవిని పంచుకున్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి 54.75 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు 54.75 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. తెలుగు పరీక్షకు 1,295 మందికి 709 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ (ఏపీఓఎస్ఎస్) హిందీ పరీక్షకు 120 మందికి 27 మంది గైర్హాజరయ్యారన్నారు. 28 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎక్కడ మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

తల్లీబిడ్డ సేవలకు సుస్తీ

ప్రజారోగ్యానికి ప్రమాదం
- డీజిల్ కొరతతో నిలిచిపోతున్న వాహనాలు
- అరకొర సేవలతో బాలింతల అవస్థలు
- రెండు నెలలుగా డ్రైవర్ల జీతాల బకాయిలు
- ఉమ్మడి జిల్లాలో 32 వాహనాలు
- రోజుకు 200 మంది తల్లీబిడ్డలను ఇంటికి చేరుస్తున్న వైనం
- సమస్యల పరిష్కారానికి నేడు సమ్మెకు పిలుపు



తణుకులో మూలకు చేరిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

సాక్షి, భీమవరం: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు సమస్యల సుస్తీ చేసింది. డీజిల్ కొరత, మరమ్మతులతో సేవ లందించేందుకు ఆపసోపాలు పడుతోంది. అరకొర సేవలతో బాలింతలు, వారి కుటుంబ సభ్యులు అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఒక్క రోజు సమ్మె నిర్వహణకు యూనియన్ సిద్ధమైంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు ప్రసవానంతరం ప్రభుత్వం 102 పేరిట తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో తల్లీబిడ్డలను సురక్షితంగా వారి ఇంటికి చేరవేస్తుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 32 వాహనాలు ఉండగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ వాహనాలు సేవలందిస్తున్నాయి. రోజుకు 200 మంది వరకు తల్లీబిడ్డలను వారి ఇళ్లకు చేరుస్తున్నాయి. గతంలో సాఫీగా సాగిన సేవలు కొంత కాలంగా ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలో 14 వాహనాలు ఉండగా వాటిలో తొమ్మిది మాత్రమే సేవలు అందిస్తున్నాయి. ఆచంట, తాడేపల్లిగూడెం, తణుకు తదితర చోట్ల ఐదు వాహనాల కెప్టెన్లు (డ్రైవర్లు) కొరత, మరమ్మతులతో మూలకు చేరాయి.

డిమాండ్ల సాధన కోసం పోరుబాట
ప్రస్తుతం ఇస్తున్న రూ.8,850 జీతం సకాలంలో ఇవ్వకపోగా నెలల తరబడి బకాయిలు పేరుకుపోతున్నాయి. ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ పలుమార్లు ప్రభుత్వానికి వినతులు అందజేయడంతో ఇటీవల ఫిబ్రవరి వరకు బకాయిలు విడుదల చేసింది. మరో రెండు నెలలు జీతాలు రావాల్సి ఉన్నట్టు నాయకులు చెబుతున్నారు. కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, వాహనాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని, ఆదివారం, వీక్లీ ఆఫ్‌లు, పండుగ సెలవులు అమలుచేయాలని, యజమాని వాటా పీఎఫ్‌ను యాజమాన్యమే చెల్లించాలని, ఈఎస్ఐ అమలుచేయాలని, 8 గంటలు పని విధానం, బఫర్ సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. డిమాండ్ల సాధన కోసం యూనియన్ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం ఒక్క రోజు సమ్మెలో భాగంగా కలెక్టరేట్ల వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్టు యూనియన్ నాయకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెరుగైన సేవలు
తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను పేదలకు ఎంతో మెరుగ్గా అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది. ఎయిర్ కండిషన్ సౌకర్యాలతో కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి దూరప్రాంతాలకు సైతం ఈ వాహనాల్లో తల్లీబిడ్డలను వారి గమ్యస్థానాలకు చేరవేసేలా కార్యాచరణ చేసి అమలుచేశారు. ప్రసవానంతరం తల్లీబిడ్డలతో ఇళ్లకు చేరుకునేందుకు పేదవర్గాల వారికి ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పుడు సేవలందించేందుకు వాహనాలు మొరాయిస్తుండటంతో వారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తల్లీబిడ్డ సేవలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని పేదలు కోరుతున్నారు.

వేధిస్తున్న సమస్యలు



వాహనం లేకపోవడంతో ఆటోలో తల్లీబిడ్డను ఇంటికి తరలిస్తున్న దృశ్యం

మార్చి 30తో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను నడుపుతున్న ప్రైవేట్ సంస్థతో టెండరు గడువు ముగియగా ప్రభుత్వం మరో రెండు నెలలు పాటు పొడిగించినట్టు యూనియన్ నాయకులు చెబుతున్నారు. గతంలో అవసరమైన మేర వాహనాల్లో డీజిల్ పోయించుకునే వెసులుబాటు ఉండగా కొద్ది నెలలుగా పరిమితం చేసినట్టు చెబుతున్నారు. దీంతో నెలలో డీజిల్ ఉన్న మేర వాహనాలను నడిపి అయిపోయినప్పుడు మూలకు చేరుస్తున్నారు. మరోపక్క సకాలంలో ఆయిల్ ఛేంజింగ్, మరమ్మతుల చేయకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందంటున్నారు. సేవలు సరిగా అందక తల్లీబిడ్డలను ఇళ్లకు తీసుకువెళ్లేందుకు వారు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి వారు అడిగిన మొత్తం చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

క్లుప్తంగా

పిప్పర పంట కాల్వలో గుర్తుతెలియని మృతదేహం



పిప్పర కాల్వలో దొరికిన మృతదేహం

గణపవరం: గణపవరం మండలం పిప్పర పంటకాల్వలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈవిషయంపై వీఆర్వో గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందని, కాల్వలో పడి ఎలా మరణించాడన్న విషయం తెలియరాలేదని, వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆకుల మణికుమార్ తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



మైనర్ బాలికను వన్ స్టాప్ సెంటర్‌కు తరలించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగగుంట గ్రామంలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన మైనర్ బాలిక (15)కు వివాహం నిశ్చయించినట్లు 1098కు సమాచారం అందడంతో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవాని, బేబి బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఐసీడీఎస్, ఐసీపీఎస్, సీడబ్ల్యూసీ వారి ఆదేశాల మేరకు బాలికను వన్ స్టాప్ సెంటర్‌కు తరలించినట్లు సూపర్‌వైజర్లు తెలిపారు. సచివాలయ జీఎంఎస్‌కే యు.సంధ్య, అంగన్‌వాడీ వర్కర్ కే.గంగారత్నం తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



చల్లా రామారావు (ఫైల్)

పెంటపాడు: ఉపాధి హామీ పనులు చేస్తున్న ఓ కూలీ అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పెంటపాడు మండలం ముదునూరు గ్రామానికి చెందిన చల్లా రామారావు (81) సోమవారం గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లాడు. పనిచేస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. తమతోపాటు పనులకు వచ్చిన రామారావు అకస్మాత్తుగా చనిపోవడంతో మిగిలిన ఉపాధి కూలీలు విలపించారు. కాగా పని ప్రదేశంలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉండగా పలు గ్రామాల్లో కనీసం మందులు సరఫరా చేసేవారు కూడా రావడం లేదని కూలీలు చెబుతున్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన ఓ మహిళను బెదిరించి బంగారు ఆభరణాలు అపహరించిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఒకటో పట్టణ సీఐ ఎం. నాగరాజు తెలిపారు. వి. రామాకుమార్ పోలీసు బొమ్మ కూడలి వద్ద గతంలో సెల్‌ఫోన్ దుకాణం నిర్వహించేవాడు. ఓ మహిళను బెదిరించి ఆమె దగ్గర ఉన్న 4 కాసుల బంగారు ఆభరణాలు అపహరించాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో సోమవారం హాజరుపరచగా అతడికి రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

మట్టి తరలింపు వాహనాలతో ఉక్కిరిబిక్కిరి

- చెరుకువాడలో విచ్చలవిడిగా మట్టి రవాణా
- రోడ్డుపై ఉన్న మట్టి పెలుసులతో తరచూ ప్రమాదాలు
- వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి వాహనాలను అడ్డుకున్న ప్రజలు
- కాసేపటికే వదిలేసిన అధికారులు



చెరుకువాడలో మట్టి రవాణాను అడ్డుకున్న స్థానిక ఎంపీటీసీ, వార్డు సభ్యులు, నాయకులు



బారులు తీరిన ట్రాక్టర్‌లు

ఉండి: ఒకవైపు వర్షం.. మరోవైపు మట్టి రవాణా వాహనాలతో చెరుకువాడ గ్రామం సోమవారం ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరైంది. మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుండడంతో మట్టి పెళుసులు రోడ్డుపై పడి ఈ ప్రాంతవాసులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు బొడ్డు నాగన్న, ఎంపీటీసీ చిగురుపాటి కృష్టాఫర్, వార్డు సభ్యుడు బిల్‌మోరియా ఆధ్వర్యంలో మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపటికే ట్రాఫిక్‌జామ్ ఏర్పడి మట్టి రవాణా వాహనాలు బారులు తీరాయి. సమస్యపై ఎన్నిసార్లు గ్రామాధికారులు, మండలాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ నాగార్జున వెంటనే వీఆర్ఏను పంపించి వాహనాలను నిలుపుదల చేశారు. దీంతో స్థానికులు ఎవరి పనులకు వాళ్లు వెళ్లిపోయారు. అయితే కొద్దిసేపటికే మట్టి రవాణా వాహనాలు తిరిగి రోడ్డెక్కడంతో ప్రజలు అవాక్కయ్యారు. ఇదేంటి అని అధికారులను ఆరా తీసినా సమాధానం చెప్పేవారు కరువయ్యారు. ఇది కూటమి నాయకులకు సంబంధించిన మట్టి కాబట్టి మేము ఆపలేము అని ఓ గ్రామాధికారి చెప్పడంపై స్థానిక నాయకులు మండిపడుతున్నారు. చెరుకువాడ నుంచి అర్తమూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు, గుమ్ములూరు పరిధిలో జాతీయ రహదారిపై మట్టి పరుచుకుపోవడంతో చాలా మంది వాహనదారులు సోమవారం సైతం ప్రమాదాలకు గురయ్యారు. అయితే ఇదేమీ మాకు సంబంధం లేదన్నట్లు ఆయా శాఖల అధికారులు ప్రవర్తించడం వింతగా ఉందని స్థానికులు తెలిపారు.

బ్యాంక్ వద్ద డ్వాక్రా మహిళల బైఠాయింపు



రెడ్డిగణపవరం బ్యాంక్ వద్ద బైఠాయించిన మహిళలు

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం బ్యాంక్ ఎదుట గాడిదబోరు గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు సోమవారం బైటాయించారు. బ్యాంకు రుణాలు మంజూరు చేసిన విషయం తమకు తెలియదని, దీంతో తాము వడ్డీ నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మేనేజర్ కుమార్, ఏపీఎం పద్మావతి మాట్లాడుతూ రుణాల సొమ్ములు డ్వాక్రా సంఘాల ఖాతాలోనే ఉన్నందుకు వాటిని తిరిగి రికవరీ చేయడంతోపాటు, వారికి ఎటువంటి వడ్డీ పడకుండా ఉండేలా మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనితో డ్వాక్రా మహిళలు శాంతించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జోడే సత్యదుర్గాప్రసాద్, డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే లైసెన్స్ సస్పెన్షన్

- ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం
- జిల్లాలో ద్విచక్ర వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ అధికారులు ఏలూరు నగరంతో పాటు జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రాంతాల్లో సోమవారం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 61 ద్విచక్ర వాహన చోదకులపై కేసులు నమోదు చేసి రూ.1,56,000 అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా కరీమ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని తెలిపారు. మోటార్ సైకిల్ లేదా స్కూటర్లను నడిపే వాహన చోదకులు హెల్మెట్ ధరించని పక్షంలో జరిమానా విధించడంతో పాటు 3 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. రహదారి ప్రమాదాల్లో ద్విచక్ర వాహన చోదకులే అధిక శాతం మరణిస్తున్నారని, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణనష్టం జరుగకుండా నివారించవచ్చన్నారు. రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించిన నాడే మరణాలను తగ్గించగలుగుతామన్నారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో ఎంవీఐ శేఖర్, ఏఎంవీఐలు స్వామి, నరేంద్ర, సురేష్ బాబు, జమీర్, కళ్యాణి, కృష్ణవేణి, అన్నపూర్ణ, జగదీష్ పాల్గొన్నారు.

పని భారంపై వీఆర్‌వోల నిరసన



తహసీల్దార్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్‌వో అసోసియేషన్ నాయకులు

కొయ్యలగూడెం: క్లస్టర్ విధానంలో రేషనలైజేషన్ పేరుతో విడుదల చేసిన జీవో నెంబర్–4 విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని వీఆర్‌వో అసోసియేషన్ డివిజనల్ అధ్యక్షుడు అడపా రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌వోలు నిరసన కార్యక్రమం చేపట్టారు. రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా నిర్ణయిస్తూ దానికి ఒక వీఆర్‌ఓని మాత్రమే నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని వీఆర్‌వో అసోసియేషన్ ఖండించింది. ఒక్కో సచివాలయానికి మిగిలిన శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులను ఒక్కొక్కరిని నియమిస్తూ, రెవెన్యూ వ్యవస్థ వచ్చేసరికి రెండు సచివాలయాలకు కలిపి ఒకరినే నియమించడం వల్ల తీవ్రమైన పనిభారం, ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పేర్కొన్నారు. ఇప్పటికే ఒక సచివాలయంలోనే ఉన్న విధులను నిర్వహించడానికి తీవ్రమైన మానసిక ఒత్తిడికి ఎదుర్కొంటుండగా రెండు సచివాలయాలను కలపడం అన్యాయం అన్నారు. అనంతరం ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తహసీల్దార్ కె.చెల్లన్నదొరకు వినతిపత్రం సమర్పించారు. వీఆర్‌వోలు కె.మధు, బట్టు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిళ్లు ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో సన్నిబాబు మృతదేహం

పెనుగొండ: రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆచంట మండలం కోడేరు వద్ద సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెనుగొండ మండలం దేవ శివారు తాళ్లపాలెంకు చెందిన గడ్డం సన్నిబాబు (18) సోమవారం తన అమ్మమ్మ ఊరు పాలకొల్లుకు వెళుతున్నాడు. కోడేరు నుంచి మోటారు సైకిల్‌పై ఆచంట వైపు వస్తున్నాడు. అదే సమయంలో తూర్పుగోదావరి జిల్లా గన్నవరం మండలం లంకల గన్నవరం శివారు నడిగడి గ్రామానికి చెందిన యన్నాబత్తుల సత్యనారాయణ, అతని భార్య కృష్ణకుమారి ఇద్దరు మోటారు సైకిల్ పై ఆచంట నుంచి కోడేరు వెళుతున్నారు. ఈ రెండు మోటార్‌సైకిళ్లు కోడేరు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సన్నిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. యన్నాబత్తుల సత్యనారాయణకు, అతని భార్య కృష్ణకుమారికి గాయాలు కావడంతో వారిని 108 వాహనంలో పాలకొల్లు ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన సన్నిబాబు పెనుగొండ కళాశాలలో ఇంటర్ చదువుతూ ఇటీవల విడుదలైన ఫలితాలలో ఉత్తీర్ణత సాధించాడు. గత ఏడాది కాలంగా అతను చదువుకుంటూనే పాలకొల్లులో వీడియో ఎడిటింగ్ కూడా చేస్తున్నాడు.

29లోగా సిపెట్ డిప్లమో కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

ఏలూరు (టూటౌన్): సిపెట్ డిప్లమో కోర్సుల్లో చేరేందుకు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'భారత ప్రభుత్వ సంస్థ – సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ – టెక్నాలజీ (సీఐపీఈటీ) – విజయవాడలో 10వ తరగతి విద్యార్హతతో 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో 2 సంవత్సరాల వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) కోర్సులకై ఆన్‌లైన్‌లో ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ – హెడ్ శేఖర్ తెలిపారు. ఈ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని, సిపెట్ అడ్మిషన్ టెస్ట్ (సీఏటి)ను జూన్ 8, 2025 నాడు నిర్వహించి అందులో వచ్చిన ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లను భర్తీ చేస్తారని తెలిపారు. వివరాలకు జి. మల్లేశ్వర రావు సెల్‌ఫోన్ నంబర్ 9440531978లో సంప్రదించాలన్నారు.

రేషన్ కోసం అవస్థలు



రేషన్ బియ్యం కోసం టి. పోచవరం వెళ్లిన నిర్వాసితులు



వాహనాల్లో బియ్యంను తీసుకువెళ్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: రేషన్ బియ్యం కోసం నిర్వాసితులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం మండలం తుమ్మిలూరు, జిల్లేడుగొంది, కొల్లూరు, కొత్తూరు, టి.పోచవరం గ్రామాల నుంచి కొందరు నిర్వాసితులు బుట్టాయగూడెం మండలం నిమ్మలగూడెం, రామన్నగూడెంల మధ్య నిర్వాసిత కాలనీకి తరలివచ్చారు. అయితే రేషన్‌బియ్యం కోసం మాత్రం తమ సొంత గ్రామమైన వీఆర్‌పురం మండలం తుమ్మిలూరు గ్రామానికి వెళ్లి వస్తున్నారు. బుట్టాయగూడెం మండలంలో ప్రస్తుతం వీరు ఉంటున్న నిర్వాసిత కాలనీ నుంచి వీఆర్ పురం మండలం తుమ్మిలూరు గ్రామానికి సుమారు 235 కిలోమీటర్ల దూరం. దీంతో ప్రతినెలా రూ. 13 వేలు చెల్లించి 46 కార్డుల లబ్ధిదారులు ఆ బియ్యం తెచ్చుకుంటున్నామని నిర్వాసితులు వేట్ల ముత్యాలరెడ్డి, అందెల రామిరెడ్డి, అందెల సీతారామరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ వేరే జిల్లా కావడంతో వీలుపడడం లేదని, దీంతో ప్రతి నెలా రేషన్ కోసం సొంత ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. పూర్తి స్థాయిలో గ్రామాలు తరలిరాకపోవడం వల్ల తమ కార్డులు ఈ మండలానికి బదిలీ కాలేదని నిర్వాసితులు చెబుతున్నారు. జూన్ మొదటి వారంలో నిర్వాసితులను పూర్తిస్థాయిలో తరలిస్తున్నామని అధికారులు చెబుతున్నారని, కార్డులు ఈ మండలానికి మారే వరకు తమకు ఈ కష్టాలు తప్పవని వాపోయారు.

కంప్యూటర్ కోర్సుకు వెళ్లి వస్తుండగా..

- మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కంటైనర్ లారీ
- ప్రమాదంలో యువకుడి మృతి



యర్రంశెట్టి సతీష్ (ఫైల్)

పెంటపాడు: కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొనడంతో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లి గ్రామానికి చెందిన యర్రంశెట్టి వీరవెంకట సత్యనారాయణ (సతీష్) ఇంటర్ విద్యను పూర్తి చేసుకొన్నాడు. అనంతరం ప్రతి రోజు పెంటపాడు వచ్చి కంప్యూటర్ కోర్సు నేర్చుకొంటున్నాడు. సోమవారం యథావిధిగా కంప్యూటర్ క్లాస్ ముగించుకుని మోటార్‌సైకిల్‌పై స్వగ్రామం వెళ్తూ ఉండగా పెంటపాడు కళాశాల వద్ద విశాఖపట్నం నుంచి భీమవరం వెళుతున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో సతీష్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు ఇలా అర్థాంతరంగా చనిపోయాడని తండ్రి నాగరాజు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా నాగరాజుకు ఒక కుమారుడు, కుమార్తె. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

కాళ్ల: అదనపు కట్నం వేధింపులపై కాళ్ల పోలీసు స్టేషన్లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్ఎన్ పురం గ్రామానికి చెందిన ఎస్.రత్నావతి కి అదే గ్రామానికి చెందిన వెంకన్నతో సుమారు 9 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు అమ్మాయిలు సంతానం. ఇటీవల చెడు వ్యసనాలకు బానిసైన భర్త వెంకన్నతోపాటు అత్తమామలు సైతం తనను అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్నారని రత్నావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై నాళం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ చోరీపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఏఎస్సై దుర్గారావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పుప్పాల మురళీకృష్ణకు వెంకట్రామన్నగూడెం గ్రామంలో ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనిని బండారు సత్యనారాయణ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చాడు. అయితే ఈ నెల 16వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి దానిలో రాగి వైరును చోరీ చేశారు. సోమవారం ఉదయం సత్యనారాయణ పొలానికి వచ్చి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, రాగి వైరు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని మురళీకృష్ణకు తెలియజేయడంతో ఆయన రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఏఎస్సై దుర్గారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు



నా శత్రువు నాటికలో దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం, హేలాపురి కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. సోమవారం హైదరాబాద్ యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నా శత్రువు, సహృదయ ద్రోణాదుల సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన వర్క్ ఫ్రమ్ హోమ్ నాటికలకు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన లభించింది. తొలుత అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి మాట్లాడుతూ ఏలూరులో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలోను, కళలను ప్రోత్సహించడంలో అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం ఎప్పుడూ ముందుంటాయన్నారు. నాటక రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న కళాకారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, సెక్రటరీ కళారత్న కేవీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు ఐరదల ముద్దుకృష్ణ, సెక్రటరీ మజ్జి కాంతారావు, అంబికా ప్రసాద్, అంబికా రాజా, వేణుగోపాల్ లునాని, ఎంవీవీ నాగేశ్వరరావు, ఎల్.వెంకటేశ్వరరావు, కేబీ రావు, సంకు సురేష్, ఎం.సూర్యనారాయణ యాదవ్, తదితరులు పాల్గొనగా ఈ కార్యక్రమాన్ని మహమ్మద్ ఖాజావలి సమన్వయం చేశారు.

విశాఖ కార్మికుల సమ్మెకు మద్దతు

నూజివీడు: ఈనెల 20 నుంచి విశాఖ ఉక్కు కార్మికులు నిరవధికంగా చేయనున్న సమ్మెకు సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఏఐసీసీటీయూ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి హరినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం మొక్కుబడిగా రూ.11,500 కోట్లు ఇచ్చినప్పటికీ అవి కార్మిక సంక్షేమానికి ఉపయోగించకుండా కేవలం అప్పులు తీర్చుకోవటానికి ప్రభుత్వం సిద్ధం కావడం శోచనీయమన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటైజేషన్ చేయమని మోడీ, చంద్రబాబు బహిరంగంగా ప్రకటించాలని హరినాథ్ డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు నుండి స్టీల్ ప్లాంట్ కు మెటీరియల్ రాకుండా చేసిన కుట్రలను కూడా కార్మికులు తిప్పికొట్టారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను 4200మందిని ఎటువంటి నోటీసు సమాచారం లేకుండా గేట్ పాసులు ఇవ్వకుండా నిలిపి వేశారన్నారు. గోల్డెన్ సెకండ్ హ్యాండ్ పేరుతో పర్మినెంట్ ఉద్యోగులను తొలగిస్తూ, వారి స్థానంలో కొత్తవారిని నియమించడంలేదని ధ్వజమెత్తారు. మిట్టల్ ఉక్కు ఫ్యాక్టరీ కోసమే ప్రభుత్వాలు విశాఖ ఉక్కును నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా అమలు చేయటం లేదన్నారు. విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత తెలుగు ప్రజలపై ఉందన్నారు.

అలరించిన ఇంద్రధనుస్సు



ఉండిలో సోమవారం ఇంద్ర ధనుస్సు ప్రజలను అలరించింది. ఉదయం కురిసిన వర్షపు జల్లులకు వినీలాకాశంలో ఇంద్ర ధనుస్సు ప్రత్యక్షం కావడంతో ప్రజలంతా ఎంతో అబ్బురంగా చూశారు. కొందరు తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో సైతం పోస్టులు చేశారు. చాలాసేపటి వరకు ఇంద్రధనుస్సు నిలిచి ఉండడంతో ప్రజలంతా ఆహ్లాదంగా తిలకించారు. – ఉండి

పారిజాతగిరిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పారిజాతగిరిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకులతిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచన, మేదిని పూజ, మృత్ సంగ్రహణము, అంకురారోపణము తదితర వైదిక కార్యక్రమాలతో శ్రీ వైఖానసాగమోక్తంగా ఉత్సవాలు ప్రారంభించారు. ముందుగా ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీనివాసుడిని పెండ్లి కుమారుడిగా శ్రీదేవి భూదేవి అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పేరిచర్ల జగపతిరాజు, సభ్యులు దండు ధనరాజు, వాసవి సాయి నగేష్, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను కార్యనిర్వహణ అధికారి మాణికల రాంబాబు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

దివ్యాంగుల పిల్లలను బడిలో చేర్పిద్దాం



సచివాలయం వద్ద ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలను బడిలో చేర్పిద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలో దివ్యాంగుల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం సోమవారం 5వ వార్డు సచివాలయంలో నిర్వహించారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగుల పిల్లలకు ఉచితంగా కల్పిస్తున్న సదుపాయాలను వెల్లడించారు. కరపత్రాలను అందజేశారు. బడి వయస్సు, బడి బయట ఉన్న దివ్యాంగుల పిల్లలను బడిలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ బంగ్రరాజు, ఆరోగ్య కార్యకర్త డి.సుష్మ మాధురిలు మాట్లాడారు. సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు



పుల్లాయగూడెంలో అదుపులోకి తీసుకున్న బెల్ట్ షాపు నిర్వాహకుడితో ఎక్సైజ్ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఏడు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు దొరబాబు, మురళీమోహన్, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్ పరీక్షలు



పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీ సెట్ ప్రవేశ పరీక్షలు సోమవారం పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా పరీక్షలు నిర్వహించగా, ఉదయం పరీక్షకు 240మందికి గాను 217మంది, సాయంత్రం పరీక్షకు 240మందికి గాను 222మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు. అడ్మిన్ కొల్లా సురేష్, అడ్మినిస్ట్రేటర్ నటరాజ్ పరీక్షలను పర్యవేక్షించారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం: జిల్లాలో నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణలో ఉండేలా తగుచర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో టి.రాహుల్ కుమార్‌రెడ్డి నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో భాగంగా జిల్లాలోని పలు వర్తక సంఘాలు, సివిల్ సప్లై, మార్కెటింగ్ అధికారులతో బియ్యం, పప్పులు, వంట నూనెలు, కూరగాయలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరల పెరుగుదలను నియంత్రించి డిమాండ్‌కు తగినట్లుగా స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఆక్వా సాగు విరామానికి సంఘీభావం

యలమంచిలి: ఆక్వా ఫీడ్ ధరల నియంత్రణతోపాటు ప్రాసెసింగ్ యూనిట్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడానికి జూలై నుంచి ఆక్వా సాగుకు విరామం ప్రకటించాలని నిర్ణయించామని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు తెలిపారు. చించినాడలో సోమవారం నిర్వహించిన ఆక్వా రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలి ధరలతోపాటు ఫీడ్ ధరలు గణనీయంగా పెరగడం, రొయ్యల ధరలను సిండికేట్లు భారీగా తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

చిల్లర రాజకీయాలకు తెరతీసిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలకు ప్రలోభాలకు గురిచేసిన వైనం
- కూటమి అభ్యర్థులే ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా ఎన్నిక



అత్తిలిలో ఎంపీపీ ఎన్నికకు వెళ్లేందుకు రోడ్డుపై వేచి ఉన్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు



ఎన్నికలు ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీవో

అత్తిలి: కూటమి ప్రభుత్వం చిల్లర రాజకీయాలకు తెరతీసింది. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులను ప్రలోభాలకు గురిచేసి, అడ్డదారుల్లో ఎంపీపీ పదవిని కూటమి చేజిక్కించుకుంది. ఎంపీపీ పదవికి వైఎస్సార్ సీపీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ, గతంలో ఎన్నడూలేని విధంగా విష సంస్కృతికి కూటమి ప్రభుత్వం నాంది పలికింది. తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు మధ్య జరిగిన ఈ ఎన్నికల్లో ఊహించినట్లుగానే కూటమి ఖాతాలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులను వేసుకుంది. ఎంపీపీగా మక్కా సూర్యనారాయణ, వైస్ ఎంపీపీగా కొనకళ్ల విజయనిర్మల ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి మురళీకృష్ణ ప్రకటించారు. ఎన్నికల అధికారి సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో కూటమి తరపున ఎంపీపీ అభ్యర్థిగా నిలిచిన మక్కా సూర్యరావుకు 11 మంది ఎంపీటీసీ సభ్యులు తమ మద్దతు తెలియజేయగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న రంభ సుజాతకు ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు మద్దతు తెలిపారు. దీంతో ఎన్నికల అధికారి మురళీకృష్ణ ఎంపీపీ అభ్యర్థిగా మక్కా సూర్యరావును ప్రకటించారు. అనంతరం వైస్ ఎంపీపీగా కొనకళ్ల విజయనిర్మలను ఎన్నుకున్నారు. వీరికి ఎన్నికల అధికారి మురళీకృష్ణ ధ్రువీకరణ పత్రాలు అందజేసారు. మండలంలో 20 మంది ఎంపీటీసీలకు గాను ఎన్నికలలో 16 స్థానాలు వైఎస్సార్ సీపీ, రెండు టీడీపీ, రెండు జనసేనపార్టీల అభ్యర్థులు గెలిచారు. ఇందులో వైఎస్సార్ ఎంపీటీసీ అభ్యర్థిని గల్ఫ్‌లో ఉండటంతో 19 మంది ఎన్నికలకు హాజరయ్యారు. వైఎస్సార్ సీపీకి చెందిన 8 మంది ఎంపీటీసీ సభ్యులు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇంటినుండి బయలుదేరి ఎన్నికలు జరిగే మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఎంపీపీ ఎన్నికలో ఓటువేయడానికి కూటమి పార్టీకి చెందిన నలుగురు ఎంపీటీసీ సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ నుండి కూటమి పార్టీలో చేరిన ఏడుగురు సభ్యులు అంబులెన్స్ వాహనంలో తీసుకురావడం చర్చనీయాంశమైంది. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వారి వెంటవచ్చి ఎన్నిక ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు ఉన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్‌కౌర్ బానో, ఎంపీడీవో పి శామ్యూల్ పాల్గొన్నారు.

నాడు కుట్రపూరితంగా ఎన్నిక జరగనివ్వలేదు

ఖాళీ అయిన అత్తిలి మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికల కమిషన్ మార్చి 27న ఎన్నికలు నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. ఈసమయానికి వైఎస్సార్ సీపీ నుంచి ఇద్దరు ఎంపీటీసీలు కూటమిపార్టీలో చేరారు. అప్పటికే వైఎస్సార్‌సీపీకి 13 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత ఎంపీపీగా, వైస్ ఎంపీపీగా అద్దంకి శ్రీనుపేర్లను ఖరారు చేసారు. స్పష్టమైన మెజార్టీ వైఎస్సార్‌సీపీకి ఉండటంతో సునాయాసంగా గెలిచే అవకాశం ఉంది. అయితే కూటమి నాయకులు కుట్రపూరితంగా వ్యవహరించి ఎన్నికలను అడ్డుకున్నారు. ఎంపీపీ, వైస్‌ఎంపీపీ ఎన్నికలలో ఓటు వేయడానికి మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు నివాసం నుంచి బయలుదేరుతున్న సమయంలో ఒక్కసారిగా కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి కారుమూరి నివాసాన్ని చుట్టుముట్టారు. ఎంపీటీసీలు ఓటు వేయడానికి వెళ్లకుండా అడ్డుపడారు. దీంతో ఆరోజు ఎన్నికలు నిలిచిపోయింది. ఎన్నికల అధికారులు మరుసటి రోజు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో మరుసటిరోజున కూటమి శ్రేణులు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రోడ్లను దిగ్బంధించి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఓటువేయడానికి వెళ్లకుండా అడ్డుపడ్డారు. దీంతో ఎన్నికల అధికారులు ఎన్నిక ప్రక్రియను వాయిదావేసారు. ఇటీవల మరలా ఎన్నికల కమిషన్ ఎంపీపీ ఎన్నికలు జరపడానికి ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో కూటమి పార్టీలకు స్పష్టమైన మెజార్టీలేకపోవడంతో, ఎలాగైనా ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలనే దుర్బుద్ధితో కుట్రలకు తెరలేపారు. గతంలో వెళ్లిన ఇద్దరు ఎంపీటీసీలకు తోడు మరో ఐదుగురు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి, కూటమి పార్టీలో చేర్చుకున్నారు. దీంతో కూటమికి 11 మంది బలం చేకూరడంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలను కూటమి ఖాతాలో వేసుకుంది.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న పని ప్రదేశంలో నిరసన చేస్తున్న వ్యకాస సంఘం

పెంటపాడు: ఉపాధి శ్రామికులు సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మికసంఘ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం పెంటపాడు మండలంలో పలు గ్రామాలలో ఉపాధి హామీ సిబ్బంది కలిసి ధరల అదుపుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ ఆకాశాన్నంటుతున్న ధరలను అదుపులోకి తెచ్చి తక్షణం శ్రామికులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. శ్రామికులు ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. శ్రామికులకు తక్షణ బకాయిలు విడుదల చేసి పనిదినాలు పెంచాలన్నారు. ఉపాధి సిబ్బందికి కూడా పని ప్రదేశంలో సరైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

'గూడెం'లో 16.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గడచిన 24 గంటల్లో 16.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ సోమవారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 13.2 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైందన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే



సమీప ప్రాంతాలలో వ్యర్థాలు



విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఎదురుగా వ్యర్థాలు

- పాతూరులో దుర్వాసన భరించలేకపోతున్న స్థానికులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా జీవించవచ్చు. కానీ పాతూరు 12వ వార్డులో పాతూరు 12 వవార్డులో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ప్రాంతంలో ఎన్నో నెలలు క్రితం వేసిన చెత్త చెదారాలు ఎక్కడవి అక్కడే ఉండటంతో అవి దుర్వాసన కలుగజేస్తున్నాయి. వార్డులో సేకరించిన చెత్త చెదారాలను ఏదో ఒక పాయింట్ వద్ద అదే ప్రాంతంలో ఉంచుతున్నారు. ఇతర రహదారులలో సైతం చెత్త చెదారాలు అలానే ఉన్నాయి. వాటిని పారిశుద్ధ్య ట్రాక్టర్లు తీసుకువెళ్లడం లేదు. శుభ్రం చేయలేదు. ఇటీవల రెండు రోజులు వర్షం పడటంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్ర వాతావరణాన్ని తలపింప చేస్తున్నాయి. ప్రతి రోజు ఉదయం చెత్తను తరలించే ట్రాక్టర్ వస్తుంది. ఎంపిక చేసిన పాయింట్లు వద్ద తప్ప మిగిలిన ప్రాంతాలలోని వ్యర్థాలను ఆ ట్రాక్టర్ ద్వారా తరలించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వార్డులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వ్యర్థాలను తీయకపోవడంతో ఆ ప్రదేశం అంతా పిచ్చిమొక్కలు, కలుపు మొక్కలు, పాదులు తీగలు మొలిచాయి. అంతేగాక ఆ పాదులు మెల్ల మెల్లగా ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుతున్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా సైతం అపారిశుద్ధ్య పరిస్థితులు కానవస్తున్నాయి. రానున్న రోజులలో పరిసర ప్రాంతాలు మరింత అపరిశుభ్రంగా మారనున్నాయని, సంబంధిత అధికారులు, సిబ్బంది సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వ్యర్థాలు, పిచ్చి మొక్కలు

పుస్తక పఠనంతో చిన్నారులకు ఏకాగ్రత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుస్తక పఠనంతో చిన్నారుల్లో ఏకాగ్రత కలుగుతుందని, మంచి విషయాలు తెలుసుకొనే అవకాశం కలుగుతుందని పలువురు వక్తలు తెలిపారు. పట్టణంలోని గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణశిబిరం బాలబాలికలచే నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్లుగా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే సైన్సు పాఠ్యాంశాలు, మూఢ నమ్మకాలు నమ్మకూడదని తదితర విషయాలను చెప్పారు. కోపల్లె శ్రీనివాస్‌రావుచే ధరణీదేవి స్త్రీ పాత్రవేసి, విద్యార్థులకు సమాజంలో రైతు, వైద్యులు, సైనికులు, అధ్యాపకులు, ఆవశ్యకతను వెల్లడించారు. ఆర్.జనార్ధనరావుచే పొడుపు కథలు, పుస్తక సమీక్ష, కేవీ సత్యప్రకాష్‌రావు, గ్రంథాలయంలోని వివిధ పుస్తకాలు, వాటి విశేషాలపై వివరాలు వెల్లడించారు. శ్రీదేవిచే లెక్కలలో టిప్స్ చెప్పారు. వి.రామాంజనేయులు భగవద్గీత శ్లోకాలు పాడి విన్పించారు. గంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గ్రంథాలయంలో కోపల్లె శ్రీనివాస్‌చే ధరణీదేవి స్త్రీ పాత్ర

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం రిసోర్సు పర్సన్ బి నాగేశ్వరరావు విద్యార్థులకు ప్రపంచ అట్లాస్ గురించి అవగాహన కల్పించారు. అట్లాస్‌లో వివిధ అంశాలు, ప్రాధాన్యత గురించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. టీచర్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే మార్కులు ఒక్కటే సరిపోవని, ప్రతి విద్యార్థి వివిధ అంశాలలో అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, పి వెంకటేశ్వరరావు, గంధం శేషవేంద్రరావు, ఎస్ దుర్గాప్రసాద్, జి దివ్యశ్రీ, యామిని పాల్గొన్నారు.



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు అట్లాస్ గురించి అవగాహన కల్పిస్తున్న రిసోర్సుపర్సన్

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: టాటా ఏస్ వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జేవీఎన్.ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చినతాడేపల్లి గ్రామానికి చెందిన లాయి పవన్ కుమార్ ఈ నెల 17వ తేదిన కూలి సొమ్ములు తెచ్చుకునేందుకు తన మోటారు సైకిల్‌పై బయల్దేరాడు. రామన్నగూడెం గ్రామ శివారుకు వచ్చే సరికి గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొన్నాడు. దీంతో పవన్ కుమార్ తలకు బలమైన గాయం కావడంతో 108 వాహనంలో తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి విజయవాడ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. ఈ మేరకు పవన్ కుమార్ బావ మాగంటి శ్రీనివాస యాదవ్ సోమవారం రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో 9 మందిపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: ఇరువురిని కొట్టి గాయపర్చిన ఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండ్రుప్రోలు గ్రామానికి చెందిన కొమ్ము సుబ్బలక్ష్మి, యాగర్ల వరలక్ష్మికి కరెంటు వైరు విషయంలో గొడవలు ఉన్నాయి. సుబ్బలక్ష్మి బావ అయిన కొమ్ము మంగరాజు వారిరువురికి సర్ది చెప్పారు. అయితే, సుబ్బలక్ష్మి కుమారుడు మహేష్‌ను అదే గ్రామానికి చెందిన యాగర్ల చిన్ని కొట్టడంతో ఈ విషయాన్ని ఇంటికి వచ్చి చెప్పాడు. దీనిపై కొమ్ము మంగరాజు, అతని తమ్ముడు కుమారులు నిలదీయగా, యాగర్ల వరలక్ష్మి, మరో ఇద్దరు కర్రతోనూ, చేతులు, కాళ్లతో కొట్టారు. దీంతో స్థానికులు వారిని కాపాడి తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు కొమ్ము మంగరాజు రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఏఎస్సై పీవీకే.దుర్గారావు తెలిపారు.

సమష్టి కృషితో దోమల వ్యాప్తిని అరికడదాం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : సమష్టి కృషితో కీటక జనిత ప్రదేశాలను నిలువరించి దోమల వ్యాప్తిని అరికడదామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని బేబి సెంటర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 10, 12 వార్డులలో క్షేత్ర స్థాయి పరిశీలనలు, ర్యాలీలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలను నివారించేందుకు తప్పక దోమ తెరలను వాడాలన్నారు. పరిసరాలు పొడిగా ఉంటే దోమ పుట్టదని, తడి ప్రదేశాలను నిలువరించాలని పలు సూచనలు చేశారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలను పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత తప్పదన్నారు. వారానికి ఒక్కసారి డ్రై డే పాటించడం ద్వారా దోమ లార్వాలను నిలువరించవచ్చునని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు మంగతాయరు, మేరీ, స్వాతి, కనకదుర్గ, ఆశా కార్యకర్తలు రులు పాల్గొన్నారు.



ఇంటింటికి అవగాహన కార్యక్రమాలు

స్ఫూర్తి ప్రదాత పుచ్చలపల్లి సుందరయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని పలువురు సీపీఎం నాయకులు కొనియాడారు. పుచ్చలపల్లి 40వ వర్ధంతి సభ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య భవనంలో జరిగింది. సుందరయ్య చిత్రపటానికి జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళ్లుర్పించారు. ఆయన మాట్లాడుతూ సుందరయ్య జీవిత విశేషాలు, పోరాటాలు, సేవలు తదితర అంశాలను వెల్లడించారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. పచ్చిపులుసు గోవిందు, జవ్వాది శ్రీను, ధనాల వెంకటరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, వర్రి అప్పారావు, దేశంశెట్టి సతీష్, కర్రి సాయి రెడ్డి, యడవల్లి వెంకట దుర్గారావు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటానికి నివాళ్లులు

ఆదర్శనీయుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య

తణుకు అర్బన్: దక్షిణ భారత ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర్య సమరయోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శ మార్గాన్ని నేటి పాలకులు ఆచరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ. ప్రతాప్ అన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని అమర వీరుల భవనం, రైల్వే స్టేషన్ రోడ్డు, హౌసింగ్ బోర్డు వైఎస్సార్ పార్కులో ఉన్న సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ప్రజల్ని ఎలా ప్రేమించాలో సుందరయ్యను చూసి ప్రతీ రాజకీయ నాయకుడు నేర్చుకోవాలని అన్నారు. కమ్యూనిస్టులు అధికారంతో సంబంధం లేకుండా ప్రజలు నేడు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పై పోరాటం చేస్తారని అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు అధికారం కోసం ప్రజలకు లేని పోనీ వాగ్దానాలు చేసి అధికారం వచ్చాక అమలు చేయకుండా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అధికారంలో ఉంటే ఒకవిధంగా, అధికారంలో లేకపోతే ఒకవిధంగా వ్యవహరించే రాజకీయాలను ప్రజలు ఛీకొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, ఆకుల శేషబాబు, సింగులూరి సత్యనారాయణ, భాస్కరావు, రాజు, హర్షిత, పరిమి సూరిబాబు, పి.చంద్రరావు, నాగేంద్ర కుమార్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం పేదలకు అంకితం

తాడేపల్లిగూడెం రూరల్: పేద ప్రజలు, కష్టజీవుల కోసం తన జీవితాన్ని సుందరయ్య అంకితం చేశారని సీపీఎం పార్టీ మండల నాయకులు కండెల్లి సోమరాజు, పాలుపూరి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఇటుకులగుంట, నవాబుపాలెం గ్రామాల్లో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత సోషలిజం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. సంపన్న కుటుంబంలో పుట్టి పేద ప్రజల కోసం సామాన్యమైన జీవితం గడిపి అన్ని తరగతుల ప్రజల మన్ననలు అందుకున్నారన్నారు. పార్టీ నాయకులు పాలుపూరి సత్యవతి, కండెల్లి రమేష్‌బాబు, పాలుపూరి శ్రీనివాస్, మాగపాటి దుర్గారావు, పి.ధనలక్ష్మి, కండెల్లి కమల కుమారి, రాపాక అనూష తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యకు ఘన నివాళి

ఇరగవరం: మండలలోని ఇరగవరం, యర్రాయి చెరువు, కొత్తపాడు గ్రామాల్లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయాని సీపీఎం సెక్రటేరియట్ సభ్యులు కేతా గోపాలం తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం కేతా గోపాలం మాట్లాడుతూదక్షిణ భారతదేశంలో పార్టీ నిర్మాణానికి సుందరయ్య ఎంతో కృషి చేశారన్నారు. దళితుల అంటరానితనానికి వ్యతిరేకంగా పనిచేశారని వ్యవసాయ, కర్షక, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని గుర్తుచేశారు. ఇల్లు కోటేశ్వరరావు, జంపనబోయిన విజయలక్ష్మీ, డి కనికేశ్వరరా వు, కుప్పిచెట్టి జనార్దన్, అరుణకుమారి, గుబ్బల ముత్యాలు, జక్కంశెట్టి గంగాధరరావు, తమరపల్లి మునలియ్య తదితరులు పాల్గొన్నారు.



తణుకు వైఎస్సార్ పార్కులోని సుందరయ్య విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



కొత్తపాడులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



సుందరయ్య వర్ధంతి సందర్భంగా జోహార్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందాయి. టౌన్ ప్లానింగ్ మూడు, ఇంజనీరింగ్‌కు రెండు వెరసి ఐదు అర్జీలు అందాయని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. ఎంఈ వెంకటరమణ, ఎంహెచ్‌వో డాక్టర్ రాజు, అధికారులు పాల్గొన్నారు.